# ★ కోరికలే గుర్రాలైతే— ★

అవసరాల రామకృష్ణారావు

ఆనాడే విడుదలయ్యాను. పదేళ్ల జైలు జీవితానుభవాల్ని తలుచుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాను. ఎక్కడికి వెళ్ళను? యీ ప్రపంచంలో నాకు 'నా' అనేవారు ఎవరున్నారు? నాతో భాగస్థుడై దొంగతనాలు చేసే వీరయ్య జ్ఞాపకం వచ్చాడు. వాడు మాత్రం ఎక్కడున్నాడో? నేను పట్టుబడిపోగానే ఎక్కడికి పారిపోయాడో? ఆశ్చర్యం. నా ఎదురుగుండా వీరయ్య నడుచుకు వస్తున్నాడు? వాడిని అసలు గుర్తుపట్టడమే కష్టంగా వుంది. నల్లని పెద్ద మీసాలూ, మాసిన పెద్దగెడ్డం, మాసిపోయి చిరిగిన బట్టలూ చూస్తేనే భయంకరంగా వుండేవాడు. ఎలా మారిపోయాడు! నేను పిలిస్తే నాతో మాట్లాడుతాడా అనిపించింది. ఆశ్చర్యం, వాడే దగ్గరకువచ్చి "ఏంరోయ్ రామనాథం" అని పలకరించాడు. ముట్టుకుంటేనే ధూళి అంటుకునే నా భుజంమీద తెల్లనిబట్టలు కట్టుకున్న వాడిచెయ్యివెయ్యగానే నాకు అదోలా అనిపించింది. "ఏంరా, మాయింటికి వస్తావా, పద భోంచెయ్యి- ఎన్నాళ్ళయి సరిగ్గా అన్నం తిన్నావో!" అన్నాడు. 'ఏమిటీ, ఏరోజుకారోజు కన్నంవేసే దొంగవెధవ వీడికో యిల్లా!' అనుకున్న నానోట మాటే రాలేదు. మాట్లాడలేక మంత్రగాడి మాటకు పాములాగ వాడి వెనకాలే నడిచాను.

అంత పవిత్రంగా, పరిశుభ్రంగా ఉన్న ఆ యింట్లో పాపపంకిలమయిన నా పాదాలు పెట్టడమే కష్టమైపోయింది. 'అదేమిట్రా, అలా తటపటాయిస్తున్నావ్. పద లోపలకి' అని నన్ను చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళేడు. 'సుశీ' అని గట్టిగా పిలిచాడు. లోనుండి ఓ అందమైన అమ్మాయి వచ్చింది. నిజంగా ఇంకో స్త్రీ అయితే నన్ను చూసి 'అమ్మో' అని అరవడమో, లేదా యిలాంటివాణ్ణి తీసుకొచ్చాడా? ఏమని కనీసం ఆశ్చర్యపడడమో జరిగేది. కాని ఆమె ఎంత సౌందర్యమూర్తో అంత కరుణామయి. జాలిగాఉన్న నా కనుకొలుకుల్లోకి ఓ మారు సుదీర్ఘంగా చూసి వీరయ్యవైపు తిరిగి 'ఏం?' అంది. 'వీడు నా పాతమిత్రుడు రామనాథం, త్వరలో భోజనానికి ఏర్పాటు చెయ్యి' ఆ అమ్మాయి మారుమాటాడకుండా లోనికి వెళ్లిపోయింది. 'స్నానం చేస్తావా?' అని నన్నడిగేడు. 'అలాగే' అని నేను వాడితో బాత్‌రూం వైపు నడిచాను. స్నానమైన తరువాత వాడో తెల్లని జత దుస్తులు తెచ్చి నాకిచ్చాడు. అవి కట్టుకుని తరువాత భోంచేశాను. పదేళ్ళ క్రిందట దుర్మార్గవర్తనలో భాగస్వామినైన నాకు వాడూ, మొహమైనా ఎరుగని ఆ సుశీల ఆదరించడంతోనే కడుపు నిండిపోయింది. వేరే భోజనం ఎందుకూ?

'అదేమిట్రా, మాటా మంచీ లేదు- ఎలా వున్నావ్ జైల్లో, ఏమయినా కష్టమైన పనులు చేయిస్తున్నారా? భోజనం కొంచమైనా సరిపడుతోందా?' అని భోజనానంతరం వీరయ్య నన్నడిగేడు. "ఏం మాట్లాడను? నీయీ మార్పు చూస్తే నాకెంతో ఆశ్చర్యం వేస్తోంది. దమ్మిడీ ఐనా లేని నీకీ సిరి ఎలా పట్టుకుంది? ఏరోజుకారోజు దొంగతనం చేస్తేనేగాని గడవని నీకో యిల్లూ, కుటుంబమూనా? ఇవన్నీ ఎలా వచ్చాయో చెబితేగాని నేను మాట్లాడను" అని భీష్మించుకు కూర్చున్నాను. 'సరే అయితే విను' అని వీరయ్య మొదలుపెట్టేడు.

'దొంగ, దొంగ!' అని ఆ అమ్మాయి అరవగానే ప్రక్కగదిలో ఉన్న ఎవరో ఒకాయన పరుగెత్తి నీవైపు రావడం, తలుపు ప్రక్కనున్న నేను చీకటిలోంచి కళ్లారా చూశాను. నువ్వలా పట్టుబడిపోవడం తప్పదని నేను దొడ్డి తలుపు తెరుచుకుని ఎలాగో వీధిలో పడ్డాను. దొంగ ఎప్పటికైనా పట్టుబడి తీరుతాడు. నువ్వు పట్టుబడినట్టే నేనూ ఒకనాడు పట్టుబడిపోడం ఎలాగా

తప్పదు.' ఈ సంగతి ఏ దొంగకు తెలియదు? కాని ఆలుబిడ్డలకోసం, ఆకలిమంటలకోసం, ఆత్మవిశ్వాసాన్ని చంపుకుని, వేరు మార్గం లేక, లోకంలో నీతిమార్గాలు లేక యీ తప్పుడు త్రోవలు తొక్కవలసి వస్తోంది. సరే, ఎందుకులే అనవసరపు గొడవ? అసలు సంగతి విను.

ఓనాడు ప్రొద్దుట పదిగంట లావుతుందేమో, నేను రోడ్డుమీద నడుస్తూ, ఏదో ఆలోచిస్తున్నాను. బాగా ఎండగా వుందేమో కాళ్లు చుర్రుమన్నాయి. ఎదురుగుండా గన్నేరు చెట్టుక్రింద నిలబడ్డాను. ఎదురుగుండా లక్షాధికారి సీతారామయ్యగారి మేడ కిటికీ తలుపు అద్దాలు ఎండకు తళతళ మెరుస్తున్నాయి. ఇంతట్లో ఒక పేదబిచ్చగత్తె ఆయింటి ముందువచ్చి నిలబడింది. నిజంగా ఆ మనిషిని చూస్తే ఎంతేనా జాలి వేస్తోంది. రేగిన ముంగురులు, చెమటతో ఎర్రనైన చెక్కిళ్లు, మలినమై కారుతున్న చెమట, జీర్ణవస్త్రాలు చేతిలో కెవ్వుమని ఏడుస్తున్న పసిపాప. నిజంగా ఆ దృశ్యం నన్ను ద్రవీభూతుణ్ణి చేసింది. కాని నేనేం సహాయం చెయ్యగలను? 'అమ్మా, పిల్లాడు గంటనుంచి పాలులేక ఏడుస్తున్నాడు. కాసిని పాలు పొయ్యండి తల్లీ,' ఆ స్త్రీ అలా పావుగంట పైగా అరచింది. ఇంతలో సీతారామయ్యగారే వచ్చారు. "ఏమే వెధవ గొడవా నువ్వూనూ. ఓగడీ పడుకోనియ్యవా ఏమిటి!'' అని గట్టిగా కేకవేశాడు.

''బాబూ. పిల్లాడికి పొద్దుట్నుంచీ పాలులేవు ధర్మప్రభువులు, రెండుచుక్కలుపాలు పోయించండి నాయనా!" అనిదీనాతి దీనంగాఅడిగింది.

"ఓహో, నీ బ్రతుక్కి పిల్లాడొక్కడు తక్కువయ్యాడా? ఎవరికి కన్నావే యీ వెధవని? ముష్టిముండవు నీకు పిల్లలెందుకే? చాలు, వెధవేషం వెళ్ళక్కణ్ణుంచి" అని లోపలి కెళ్ళి భడేలుమని తలుపు వేశాడో లేదో-

''కండలు తేరిన శరీరం, కాషాయవస్త్రాలూ, రుద్రాక్షమాలలూ, చేతిలో శంఖూ కాళ్ళకూ పాంకోళ్లూ ఒక యోగి 'మాతా, భిక్షాందేహి'' అని వచ్చాడు. సీతారామయ్య తలుపు తీసుకు వచ్చి 'ఓహో, స్వాములవారా దయచేయండి' అని అతి మర్యాదగా అర్ధసేరు పాలు దాహానికిచ్చి సాగనంపేడు.

లోకంలో ఎంతెంత అన్యాయాలు జరుగుతున్నాయో, ఎంతెంత దుర్మార్గాలు సంభవిస్తున్నాయో చెప్పడానికి యీ ఒక్క సంఘటనా చాలు. అప్పుడే లోకంలోకి కళ్లు తెరచిన పసిపాప గులాబీ పెదవులలోకి గుక్కెడు పాలు పొయ్యడానికి వెనుదీసిన ధనికుడు ప్రొద్దుట లేస్తే వెయ్యేసి అబద్ధాలు ఆడి, పదిమందిని మోసంచేసి, కృత్రిమంగా ధనం సంపాదించే దొంగ సన్యాసి బీడీల నోట్లో అన్యాయంగా అర్ధసేరు పాలు పోశాడు. ఇంతకంటూ అన్యాయం వుందా? కాళ్లక్రింద, నెత్తిపైన ఎండసుంట, చేతిలో పసిపాప అమాయికాక్రందన, ఆ బిక్షుకి వెఱ్ఱిచూపులు చూస్తూంటే, "చెల్లీ, మనకీ పాడులోకంలో స్థానం లేదమ్మా,పద'' అన్నాను. ఆమె తల్లి అమాయకంగా, నిర్మలంగా నా కంట్లోకి చూసింది. నా మిత్రుడిదగ్గర పావలా అప్పు తీసుకుని. పాలుకొని ఆ పాపాయి నోట్లో పోశాను. పాపాయి నోట్లో ఎర్రటి అరచేతుల్ని విప్పి, ఆనందంలో కొట్టుకుంటూ ఆపాలు అమృతంలా గుటుకు గుటుక్కున మింగుతుంటే, నా కళ్లు ఆనందంలో, తృప్తితో చెమ్మగిల్లేయి.

రామనాథం! నాకు ఆ సీతారామయ్యపై కోపం ఎక్కువై పోయింది. నా చెవులతో నేను విన్నాను ఆరోజు సీతారామయ్య పార్కులో చెప్పిన దేమిటి? ''మనం బీదలనందరినీ సమాన భావంతో చూడాలి మనకు తోచినంత దానం చెయ్యాలి'' నేడు చేసిందేమిటి? కబుర్లకూ కార్యాలకూ అంత వ్యత్యాసమా! అప్పటికే రెండు మూడు రోజులై దొంగతనం చెయ్యలేదు, ఆవేళ సీతారామయ్యగారింట్లో కన్నం వేద్దామని పించింది.

రాత్రి పన్నెండు గంటలు కొట్టేరు. మన మామూలు ట్రిక్కులు నీకు తెలుసునుగా, సీతారామయ్యగారి వీధిలోని పంపుగొట్టంద్వారా మేడ ఎక్కేను. అమావాస్య రాత్రిలా, ఎంతో చీకటిగా వుంది. ఏమీ కనిపించడం లేదు. మెల్లిగా వరండాలో ప్రవేశించాను. తలుపు మెద్దగించి గదిలోకి ప్రవేశించానో లేదో, చీకటిలో ఏమి తన్నేనో భడేలుమంది. ఆగదిలో ఎవరో లేచారు గాబోలు గడియలో గదంతా ప్రకాశమానమైంది. నేను పారి పోబోతుండగా

'ఆగు' అని వినిపించింది. ఇటు చూసేసరికి నా పాలిట యమదేవతలా చేతిలో పిస్టలు పట్టుకుని సీతరామయ్య కుమార్తె కాబోలు 'ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్?' అని అరచింది. ఎవరనిచెప్పను? 'ఎంత ధైర్యంగా ప్రవేశించావ్? క్షణంలో నేను 'నేకలేస్తే నీపని ఏమౌతుందో ఆలోచించావా?' నేనేలాగా పట్టుబడిపోతాను, యిక నాకు భయ మెందుకూ? 'ఏమౌతుంది? నువ్వూ నీ తండ్రి లాంటి మానవత్వమూ, మనసూ లేనిదానివైతే నన్ను పట్టి అప్పగిస్తావు...నీపేరు చెప్పుకుంటూ, దిక్కులేని, నాతల్లీ, ఆధారంలేని అమాయకులైన నా చిన్ని తమ్ముళ్ళు ఏడుస్తారు...అంతేనా!" అన్నాను. నా మాట ఆమె హృదయంలో శూలాల్లా గుచ్చుకున్నాయి. ఇంతట్లో మేడ మెట్లో ఎవరో ఎక్కుతున్నట్లు వినిపించింది. 'అరవ్వేం...అరు...నేను దొంగనిగా, నన్ను పట్టి అప్పగించు. చూస్తావేం" అన్నాను. జాలి గొల్పే నాకను గొలుకులూ, గోతుకుపోయిన నా కళ్లు ఆమెకు ఏంగాయపరచాయో నాకు తెలియదు.

'ఏం, నన్ను అప్పచెప్పలేదేం? నేనే అరవనా? మా బీదగుండెలమీద మీ ధనికుల కృత్యాలు యింకా చాలలేదనా" నాకా ఉద్రేకం ఎక్కణ్ణుంచి వచ్చిందో తెలియదు, అలా మాట్లాడేస్తున్నాను. 'ఆగు-గాయమై బాధపడుతున్న నాహృదయాన్ని యింకా బ్రద్దలుకొట్టకు. నీ భావాలూ బాధలూ నాకర్థమయ్యాయి. నా కర్తవ్య మేమిటో, నాగమ్యస్థాన మేమిటో, నేను ఊహించుకోలేక పోతున్నాను. ధనికులు బీదలకు చేస్తున్న అన్యాయాలు కళ్లారా ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఏంచెయ్యటమో తోదంలేదు సరే, అది అలా వుంచు, ప్రపంచంలో నీకు దొంగతనంతప్ప వేరు వృత్తే దొరకలేదా? ప్రజలని అన్యాయంగా దోచుకుతినడంలో నీకు అసంతృప్తి కలుగడం లేదా?" అంది ఆమె. నామానవత్వం దెబ్బతింది, నా పెదవులు వణకుతున్నాయి. నేనెంత మానసికయుద్ధం చేసి యీవృత్తిలో దిగేనో ఆమె గమనించే యిలా అందా? "చీకటి పడ్డ తర్వాత అర్థరాత్రి యింట్లో కన్నంవేసి దొంగలించే వాడొక్కడేనా దొంగ? ప్రజల్ని మోసంచేసి, ఆఫీసర్లు కన్నులు కప్పి, లంచాలు తిని దొంగ బ్రతుకు బ్రతికే పెద్దలు దొంగలుకారా? పైకి మహా కరక్టుగా ప్రవర్తించి, చీకటి బజారులో లక్షలార్జించి మేడలు కట్టిన మహా వ్యక్తులు దొంగలు కారా? ఫ్యాక్టరీలు నిర్మించి, పేదల రక్తం పిండించి, ఆ ఎర్రని రక్త చందనం భవనాలు రంగులు వేసుకున్న మహాత్ములు దొంగలు కారా? ఆకలి మంటకు అలిసిపోయి, చలిబాధకు చితికిపోయే బీదలకు ఏ విధంగా సహాయంచేస్తే మాత్రం తప్పేముందమ్మా? ప్రజలను అన్యాయంగా దోచుకుతినే నీ తండ్రి దొంగకూడును తినడానికి నీకుమాత్రంఅసంతృప్తికలగడంలేదా?"

"నీ నోటిలో యింత కవిత్వం దాక్కుందని, నీ హృదయంలో యిన్ని భావాలు తలదాచుకున్నాయనీ నే నెప్పుడూ అనుకోలేదు. దొంగ తిండి తినే బ్రతుకుతున్నాననే చింత నన్ను ఎప్పుడూ వేధిస్తూనేవుంది. నా చేతులతో నేను ఎప్పుడూ ఒక్క ముష్టిదానికి యిన్నిగింజలు యీ యింటిలో దానం చెయ్యలేదు. అర్థంలేని నా పాడు జీవితం ఎప్పుడూ నన్ను కలవరపెడుతూనేవుంది. నాహృదయాల్లకల్లోల సాగరంలో నావలా దొరికేవు. నువ్వు చోరుడవుకాదు, నా హృదయ చోరుడవు. నాతల్లి పోగానే నాకీ యింటితో సంబంధం వదలిపోయింది. పద నీతో వచ్చేస్తున్నాను పద." నేను నిశ్చేష్టుడ నయిపోయాను. నామాటలు యింత త్వరలో ఓ స్త్రీని కదిలిస్తాయని అనుకోలేదు. "మాట్లాడ వేం? నా తల్లి నాపేర యిచ్చిన యిరవై వేల రూపాయల నగలున్నాయి. ఎక్కడికైనా పోయి, బీదల సేవచేస్తూ ఆదర్శమైనజీవితం గడుపుదాం" ఆమె క్షణంలో ఏవేవో నగలు మూటకట్టింది. మే మిద్దరమూ చీకటిలో కలిసి పోయాం.

"ఇదిగో, నువ్వు చూసిన అమ్మాయే అనుశీల. మే మిద్దరం ఆవూరునుండి యీ వూరువచ్చి, యీ యింట్లో కాపురమున్నాము. దీనితో ఆమె లోను నాలోను కూడా పరివర్తనం వచ్చింది. హృదయాలు కలిసిన మాకు వేరే పెళ్లెందుకు? ఆ యిరవై వేలతో వ్యాపారం పెట్టి యీ విధంగా అభివృద్ధికి వచ్చేం. సాధ్యమైనంత వరకూ బీదలకు సహాయం చెయ్యడమే మాజీవిత పరమావధి. ఇంతకన్న యింకేంచెప్పను." అని మావాడు ముగించాడు.